తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

సంపుటి: 1 సంచిక: 71 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ బుధవారం 16 -10-2024 వెల: 5/రూ -










# నవంబరు 20న 'మహా' ఎన్నికలు!

- 288 స్థానాలకు ఒకే దశలో పోలింగ్
- ఝూరండ్‌కు 2 దశల్లో.. నవంబరు 13, 20 తేదీల్లో..
- దేశవ్యాప్తంగా 48 అసెంబ్లీ, 2 లోక్‌సభ
- నియోజకవర్గాలకూ ఉప ఎన్నికలు
- 23న లెక్కింపు.. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన ఈసీ

న్యూఢిల్లీ, : మహారాష్ట్ర, ఝూర?ండ్ ఎన్నికల భేరీ మోగింది. హరియాణా ఎన్నికల పర్వం ముగిసి, వారం కూడా గడవకముందే కేంద్ర ఎన్నికల సంఘం మహారాష్ట్ర, ఝూర?ండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. మహారాష్ట్రలో నవంబరు 20న ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ)

మిగతా 2లో

# దేశ రక్షణ అందరి బాధ్యత

- నేవీ రేడార్ కేంద్రంపై వివాదం సరికాదు
- దేశంలోనే రెండోది.. తెలంగాణకు గర్వకారణం
- రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుంది
- ప్రజలకు ఎలాంటి నష్టం, హాని ఉండవు
- గత ప్రభుత్వంలోనే భూ బదలాయింపు.. నిధులు
- రేడార్ కేంద్రం శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి




రంగారెడ్డి :దేశ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీలు, రాజకీయాలు ఉండాలని, దేశ రక్షణ విషయంలో అందరూ కలిసికట్టుగా సాగాలని పిలుపునిచ్చారు. మంగళవారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవుల్లో వీఎల్‌ఎఫ్ నేవీ రేడార్ స్టేషన్ ఏర్పాటు శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన గౌరవ అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్, ఎన్‌ఎఫ్‌సీ తదితర విభాగాల యంత్ర పరికరాల తయారీలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రేడార్ కేంద్రం ఏర్పాటు ద్వారా ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోందని తెలిపారు. దేశానికి మూడు వైపులా సముద్రాలు ఉన్నాయని, వాటిలో ప్రయాణించే షిప్‌లను మానిటరింగ్ చేయడానికి వీలుగా వీఎల్‌ఎఫ్ నేవీ రేడార్ స్టేషన్‌ను దామగుండంలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ అంశాన్ని వివాదం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇక్కడ రేడార్ స్టేషన్ నిర్మిస్తే జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టిస్తున్నారని తప్పుబట్టారు. వారు దేశ రక్షణ గురించి

- మిగతా 2వ పేజీలో



2లో

# గురుకులాల్లో నాణ్యమైన విద్యను అందించాలి

- కార్యదర్శులు గురుకులాలను సందర్శించాలి
- అద్దె భవనాల కిరాయి బిల్లులను చెల్లించండి
- మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచండి
- అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

# వయనాడ్ నుంచి ప్రియాంక పోటీ



2లో




## ఆ ఐదుగురు ఐఏఎస్‌లకు

# బిగ్ షాక్

హైదరాబాద్: డీఓపీటీ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్‌లో(క్యాట్) దాఖలు చేసిన పిటిషన్లపై ఐదుగురు ఐఏఎస్ అధికారులకు బిగ్ షాక్ తగిలింది. డీఓపీటీ ఉత్తర్వులను పాటించాల్సిందేనని క్యాట్ వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం సదరు ఐఏఎస్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టింది క్యాట్‌డీఓపీటీ ఆర్డర్స్ ప్రకారం రిపోర్ట్ చేయాలని, ఎక్కడి వాళ్లు అక్కడే రిపోర్ట్ చేయాలంటూ క్యాట్ ఆదేశాలు జారీచేసింది. రేపు యథావిధిగా రిపోర్ట్ చేయాలని స్పష్టం చేసింది. 'ఏపీలో ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి చోటుకు వెళ్లి వారికి సేవ చేయాలని మీకు లేదా? ఐఏఎస్‌ల కేటాయింపులపై డీవోపీటీకి పూర్తి అధికారాలు ఉన్నాయి.

# 'కట్టు' తప్పుతున్న తమ్ముళ్లకు గట్టి సంకేతం

- 18న ఎమ్మెల్యేలు, ఎంపీలతో బాబు భేటీ
- ఇసుక దందా, లిక్కర్ సిండికేట్‌పై సీరియస్
- పలువురు ఎమ్మెల్యేల తీరుపై విమర్శల వెల్లువ
- కార్యకర్తల నుంచీ అధిష్ఠానానికి ఫిర్యాదులు
- పార్టీకి, ప్రభుత్వానికీ అప్రతిష్ఠ తెస్తే సహించం
- దందాల్లో కుటుంబసభ్యులున్నా ఊరుకోం.. తేల్చిచెప్పనున్న ముఖ్యమంత్రి.. తీవ్ర ఆరోపణలున్న వారికి సెపరేట్‌గా క్లాసు



అమరావతి: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఈ నెల 18న ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. ఈ సమావేశానికి రావాల్సిందిగా ఎంపీలు, ఎమ్మెల్సీలకు మంగళవారం సమాచారం వెళ్లినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

# హైకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు

- న్యాయవాదులు మహేశ్వరరావు, ధనశేఖర్, గుణరంజన్‌కు అవకాశం
- కేంద్రానికి సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

2లో

# నౌకా దళానికి రామబాణం..

**దేశ రక్షణలో మరో ముందడుగు వీఎల్ఎఫ్ స్టేషన్**
**రియల్ టైం కమ్యూనికేషన్‌లో అత్యంత కీలకం**
**నౌకల మధ్య మెరుగైన సమన్వయానికి దోహదం**
**అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం**
**పర్యావరణానికి హాని కలిగించకుండా స్టేషన్**
**స్థానికులకు ఉద్యోగాలు.. పరిసరాల్లో ఆర్థికాభివృద్ధి**
**అవసరమైతే స్థానికులకు పునరావాస ఏర్పాట్లు**
**సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాలను పక్కనబెట్టి..**

**దేశ హితం ముఖ్యమని చాటారు: రాజ్‌నాథ్‌సింగ్**




హైదరాబాద్, :దేశ రక్షణ దళాలకు అత్యంత అధునాతన ఆయుధాలు సమకూర్చడం ఎంత కీలకమో.. అధునాతన కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా అంతే కీలకమని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. యుద్ధ సమయంలో గెలుపోటములను రియల్ టైం కమ్యూనికేషన్ నిర్ణయిస్తుందని, ప్రస్తుతం ప్రపంచ యుద్ధ పరిణామాలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ఈ దిశగా తెలంగాణలో ఏర్పాటు కాబోతున్న వీఎల్ఎఫ్ నేవీ రేడార్ కేంద్రం దేశ రక్షణలో అత్యంత కీలకంగా మారనుందన్నారు. ముఖ్యంగా నౌకాదళాలకు ఈ స్టేషన్ రామబాణం కానుందన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా దామగుండంలో కేంద్ర నౌకాదళం ఏర్పాటుచేయనున్న 'వెరీ లో ఫ్రీక్వెన్సీ స్టేషన్'కు రాజ్‌నాథ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేడార్ స్టేషన్ నిర్మాణ ప్రణాళిక కాగితాల నుంచి కా ర్యాచరణకు చేరుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సహకరించారంటూ అభినందించారు. "దేశ ప్రయోజనాలకు సంబంధించి ఎంతో ప్రాముఖ్యం కలిగిన వీఎల్ఎఫ్ స్టేషన్‌కు మాజీ రాష్ట్రపతి, ప్రముఖ మిసైల్ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతి రోజు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉంది. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తించడం రాజకీయం కాదని తన ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం అద్భుతమైన విషయం. రాజకీయమంటే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కాదు.. దేశాన్ని ఏర్పాటు చేయడమన్న ఉద్దేశంతో ఆయన ఈ ప్రాజెక్టుకు పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఇందుకు రేవంత్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు" అని రాజ్‌నాథ్ అన్నారు. "నౌకాదళాలకు రియల్ టైం కమ్యూనికేషన్‌లో ఈ స్టేషన్ అత్యంత కీలకం కానుంది. సముద్రంలో ఉండే భారతీయ నౌకాదళం నౌకల మధ్య మరింత మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థ దీంతో సమకూరనుంది. దేశ రక్షణకు సంబంధించి ఇది ఎంతో కీలకం కానుంది. మనిషి, యంత్రం మధ్యలో సమన్వయం ప్రస్తుత తరంలో ఎంతో కీలకంగా కానుందని రక్షణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థ రక్షణ రంగంలో ఎంతో కీలకం.

# 'కట్టు' తప్పుతున్న తమ్ముళ్లకు గట్టి సంకేతం

త్వ రలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలు కానుంది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. వీటితోపాటు పలువురు ఎమ్మెల్యేల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటన్నింటిపైనా అధినేత దృష్టి సారించనున్నట్టు తెలిపాయి. ముఖ్యంగా, ఇసుక దందా, మద్యం షాపుల దరఖాస్తుల్లో నడిచిన సిండికేట్ వ్యవహారాల్లో అక్కడకక్కడ కొందరు ఎమ్మెల్యేలు బెదిరింపులకు పాల్పడినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. ఈ వ్యవహారాలు సోషల్ మీడియాలోనూ వైరల్ అయింది. ఇలాంటి నేతలను గుర్తించి ఇప్పటికే అధిష్ఠానం వారికి గట్టి సంకేతాలు అందించింది. జిల్లాల్లో కొందరు ఎమ్మెల్యేల తీరుపై టీడీపీ కార్యకర్తలు సైతం అసంతృప్తితో ఉన్నారు. వారిని కట్టడి చేయాలంటూ చంద్రబాబుకు మొరపెట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యేలు, ఎంపీల భేటీ ఏర్పాటు అయినట్టు, ఈ భేటీలో అందరికీ అధినేత దిశానిర్దేశం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా.. పార్టీ కట్టుబాట్లకు కట్టుబడి ఉండాల్సిందేనని చంద్రబాబు స్పష్టం చేయనున్నారు. అక్రమ, అవినీతి, అధికార దుర్వినియోగానికి సంబంధించిన వ్యవహారాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు వారి కుటుంబసభ్యులూ ఎక్కడా తల దూర్చడానికి వీల్లేదని గట్టిగా చెప్పనున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి అప్రతిష్ఠను తెచ్చే పనులు చేసినట్టు తన దృష్టికి వస్తే సహించేది లేదని, నాయకుడి నుంచి కార్యకర్త వరకు... అందరికీ ఇదే వైఖరి వర్తిస్తుందని చంద్రబాబు తేల్చిచెప్పనున్నారు. ఏ కొద్దిమందికో కాకుండా అందరినీ ఒకే హాలులో కూర్చోబెట్టి చంద్రబాబు మాట్లాడతారు. అయితే, తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్న కొందరు ఎమ్మెల్యేలను మాత్రం విడి విడిగా ఒక్కొక్కళ్లను పిలిపించి మాట్లాడతారు. పద్ధతి మార్చుకోవాలని, బరితెగింపును సహించేది లేదని వారికి స్పష్టం చేస్తారు. కాగా, దీని కొనసాగింపుగా శనివారం,పంతొమ్మిదో తేదీన కూడా మరో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఎమ్మెల్యేలుగా లేని నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నేతలతో ఈ సమావేశం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయా నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితి, సభ్యత్వ నమోదుకు సంబంధించిన అంశాలను ఈ భేటీలో సమీక్షించనున్నట్లు పేర్కొన్నాయి.

# హైకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు



అమరావతి,: ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు మరో ముగ్గురు కొత్త న్యాయమూర్తులు రానున్నారు. ప్రస్తుతం ఏపీ హైకోర్టులో సేవలందిస్తున్న ముగ్గురు న్యాయవాదులు కుంచెం మహేశ్వరరావు, టీసీ ధనశేఖర్, చల్లా గుణరంజన్ పేర్లను ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది. వీరి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 26గా ఉంది. తాజాగా సిఫారసు చేసిన ముగ్గురి నియామకంతో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరనుంది. కాగా, వారిలో జస్టిస్ జి.నరేందర్‌ను ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఏపీ హైకోర్టులో 37 మంది జడ్జీల నియామకానికి ఆమోదం ఉంది.దకుంచం మహేశ్వరరావు 1973 ఆగస్టు 12న తిరుపతిలో కె.సుశీలమ్మ, కోటేశ్వరరావు దంపతులకు జన్మించారు. తండ్రి కోటేశ్వరరావు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌గా పదవీ విరమణ చేశారు. తిరుపతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించిన మహేశ్వరరావు.. 1998 ఫిబ్రవరి 2న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. అనంతపురం జిల్లా కోర్టులో ప్రాక్టీస్ అనంతరం హైకోర్టుకు వచ్చి సీనియర్ న్యాయవాది వేదుల శ్రీనివాస్ వద్ద జూనియర్‌గా చేరారు. ఆ తర్వాత స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించి.. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ సంబంధిత కేసులను వాదించడంలో ప్రావీణ్యం సంపాదించారు. ప్రస్తుతం హైకోర్టు ప్యానల్ అడ్వకేట్‌గా, భారత బార్ కౌన్సిల్, ఎఫ్‌సీఐ, పలు బీమా సంస్థలకు న్యాయవాదిగా సేవలందిస్తున్నారు. తూట చంద్ర ధనశేఖర్ 1975 జూన్ 10న శైలజ, చంద్రశేఖరన్ దంపతులకు జన్మించారు. ఆయన స్వగ్రామం తిరుపతి జిల్లా, సత్యవేడు. తండ్రి జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేశారు. నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించిన ధనశేఖర్ 1999లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. మాజీ అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది పరాంకుశం వేణుగోపాల్ వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ చేశారు. 2019లో ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులై వాణిజ్య పన్నులశాఖ తరఫున వాదనలు వినిపిస్తున్నారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ, ట్యాక్స్, భూసేకరణ చట్టాలకు సంబంధించిన కేసులు వాదించడంలో ఆయనకు మంచి అనుభవం ఉంది. చల్లా గుణరంజన్ 1976 జులై 12న చల్లా చంద్రమ్మ, నారాయణ దంపతులకు జన్మించారు. ఆయన స్వగ్రామం ఉమ్మడి అనంతపురం జిల్లా, తాడిపత్రి. గుణరంజన్ తండ్రి నారాయణ కూడా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. గుణరంజన్ 2001 మార్చి 21న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. తన సోదరుడు విశ్రాంత న్యాయమూర్తి చల్లా కోదండరామ్ వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. సుప్రీం కోర్టు, ఏపీ, తెలంగాణ హైకోర్టులు, వివిధ ట్రైబ్యునళ్లలో రెండు దశాబ్దాలుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. విద్యుత్, పర్యావరణ, సివిల్, క్రిమినల్, ట్యాక్స్ సంబంధిత కేసులు వాదించడంలో అపార అనుభవం గడించారు.

# గురుకులాల్లో నాణ్యమైన విద్యను అందించాలి

(మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, : ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో నాణ్యమైన విద్యను అందించడానికి చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శులతో మంగళవారం ఆయన సచివాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. విద్యాలయాల్లో బోధన తీరుపై నిపుణులతో పరిశీలన జరిపించాలని, అనంతరం ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇప్పించాలని చెప్పారు. విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని, అధికారులు ఈ విషయాలకే పరిమితం కాకుండా బోధనలో నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల విద్యాసంస్థల కార్యదర్శులు రోజూ ఒక విద్యాలయాన్ని సందర్శించి, పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఒక పూట అక్కడే ఉండి అన్ని విషయాలను సమీక్షించాలని ఆదేశించారు. కార్యదర్శులు ఎన్ని విద్యాసంస్థలను సందర్శించారు.. ఏ ఏ అంశాలను గమనించారు.. ఎలాంటి చర్యలు చేపట్టారు? అన్న వివరాలతో ఈ నెలాఖరులోగా నివేదిక ఇవ్వాలన్నారు.కార్యదర్శులు పర్యటించి సమస్యలు పరిష్కరించడం ద్వారా సిబ్బందికి భరోసా ఏర్పడుతుందని చెప్పారు. అద్దె భవనాల్లో ఉన్న గురుకుల విద్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అద్దె భవనాల యజమాలతో మాట్లాడి, భవనాల్లో అన్ని సౌకర్యాలు కల్పించేలా చూడాలని, కిరాయి బిల్లులను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. గురుకులాలను సందర్శించాలంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సమాచారమిచ్చామని, వారు సందర్శించే సమయాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు. పెరుగుతోన్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ దృష్ట్యా అధికారులు అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని మెస్ చార్జీల పెంపుపై తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వీటితో పాటు కాస్మెటిక్ చార్జీలు, ట్యూటర్ల చార్జీల పెంపుపైనా నిర్ణయం తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సమీక్షలో అధికారులు కె.రామకృష్ణారావు, సందీపకుమార్ సుల్తానియా, బుర్ర వెంకటేశం, గురుకుల విద్యాసంస్థల కార్యదర్శులు సైదులు, తఫ్సీల్ ఇక్బాల్, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

# నవంబరు 20న 'మహా' ఎన్నికలు!

(మొదటి పేజీ తరువాయి

రాజీవ్‌కుమార్ వెల్లడించారు. ఝార?ండ్‌లో రెండు దశల్లో (నవంబరు 13, 20 తేదీల్లో) ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను నవంబరు 23న ప్రకటిస్తారు. కాంగ్రెస్ నేత రాహుల్ రాజీనామా చేయడం వల్ల ఖాళీ అయిన వయనాడ్ (కేరళ)తో పాటు నాందేడ్ (మహారాష్ట్ర) లోక్‌సభ స్థానాలు, 48 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబరు 13, 20న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈసీ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నవంబరు 23న ఓట్ల లెక్కింపు జరగనుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబరు 26న, ఝార?ండ్ అసెంబ్లీ గడువు 2025 జనవరి 5న ముగుస్తున్నప్పటికీ రెండు రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఈ నెల 29 వరకు గడువు ఇచ్చారు. నామినేషన్ల ఉపసంహరణకు నవంబరు 4 వరకు గడువు ఇచ్చారు. ఝార?ండ్‌లో నవంబరు 13న జరిగే స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి తేదీ అక్టోబరు 25 కాగా ఉపసంహరణకు అక్టోబరు 30 చివరి తేదీ. నవంబరు 20న జరిగే స్థానాలకు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అక్టోబరు 29 కాగా.. ఉపసంహరణకు నవంబరు 1 చివరి తేదీ. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో 9.63 కోట్ల మంది ఓటర్లు, 81 అసెంబ్లీ స్థానాలున్న ఝార?ండ్‌లో 2.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. కాగా, వచ్చే ఏడాది ఫిబ్రవరి 15లోపు జరగాల్సిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను కూడా ఇప్పుడే జరిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీ వాల్ కోరినప్పటికీ ఈసీ పట్టించుకోలేదు.

# దేశ రక్షణ అందరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి

ఆలోచించాలన్నారు. తమిళనాడులో 1990లోనే నేవీ రేడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారని, అక్కడ ప్రకృతికి, మనుషులకు ఎలాంటి హాని జరగలేదని పేర్కొన్నారు. దేశానికి ఉపయోగపడే రెండో రేడార్ కేంద్రం మన ప్రాంతానికి రావడం సంతోషకరమన్నారు. దీని ప్రాధాన్యాన్ని తెలంగాణ సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. "దేశం ఉంటేనే మనం ఉంటాం. మనం ఉంటేనే ప్రాంతం అభ్బిద్ధి చెందుతుంది. పర్యావరణ ప్రేమికులకు ఒక్కటే చెబుతున్నా. దేశ ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ రక్షణ గురించి ఆలోచించగలం. దేశ భద్రతకు ముప్పు నుంచి కాపాడేందుకు ఏర్పాటు చేస్తున్న ఈప్రాజెక్ట్‌ను వివాదం చేయడం సరికాదు. రేడార్ స్టేషన్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఉంటుంది. మేం దగ్గరుండి పని చేయిస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ స్టేషన్ కోసం 2017లోనే భూ బదలాయింపు జరిగిందని, నిధుల కేటాయింపు వంటి నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని తెలిపారు. ప్రాజెక్టును ప్రారంభించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అడగగానే తాము కూడా ముందుకు సాగామని, దేశ రక్షణ విషయంలో రాజీ పడొద్దని, పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించానని చెప్పారు. అడ్డుకోవాలనుకునే వారికి దామగుండం శివుడే తెలివి ప్రసాదిస్తాడన్నారు. ఇది సురక్షితమైన ప్రాజెక్ట్ అని, లక్షల చెట్లు తీసేదేమీ లేదని స్పష్టం చేశారు. అబద్ధాలు చెప్పేవారి మాటలు నమ్మవద్దన్నారు. దామగుండంలో ప్రజలు విశ్వసించే పవిత్ర దేవాలయం ఉందని, అక్కడికి ప్రజలు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసి.. వచ్చి పోయేందుకు సౌకర్యం కల్పించాలని నావికా దళం అధికారులను కోరారు. నేవీ పాఠశాలలో 1/3 వంతు స్థానిక పిల్లలు చదువునేందుకు అవకాశం కల్పించాలన్నారు. దేశ భద్రతలో భాగంగా సముద్రాల్లో జలంతర్గాముల కదలికలను పసిగట్టి, అవసరమైన చర్యలు తీసుకేందుకునే వీఎల్ఎఫ్ రేడార్ ప్రాజెక్ట్ ఏర్పాటవుతోందని భారత నావికాదళం ప్రధానాధికారి దినేష్ త్రిపాఠి అన్నారు. దామగుండం రిజర్వ్ ఫారెస్టులో భాగమైన 2,900 ఎకరాల అటవీ భూమిని సైంటిఫిక్ సర్వే తర్వాత ఎంపిక చేసినట్లు తెలిపారు. వికారాబాద్‌లో ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక.. తమిళనాడులోని తిరునల్వేలిలో లోయలో ఉన్న వీఎల్ఎఫ్ స్టేషన్‌కు ఇది సహకరించడంతోపాటు నావికా దళానికి మరింత బలం చేకూరుతుందన్నారు. సముద్రాలపై నియంతరణ మెరుగుపరచడం, వ్యూహాత్మక శక్తిని పెంచడమనేది ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలతోపాటు ఈ ప్రాంతం అభివృద్ధి కూడా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అతి తక్కువ ఫ్రీక్వెన్సీతో దీనిని ఏర్పాటు చేయబోతున్నట్లు, ఈ తరంగాలతో మానవులకు, జంతుజాలానికి ఎలాంటి హానీ ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కేంద్ర మంత్రి బండి సంజయ్, భారత నావికాదళం ప్రధానాధికారి దినేశ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్ ద్వారా వికారాబాద్‌కు చేరుకోవాల్సిన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గాన దామగుండంకు వేర్వేరు వాహనాల్లో చేరుకున్నారు.

# వయనాడ్ నుంచి ప్రియాంక పోటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 15: వయనాడ్ లోక్‌సభ సీటుకు ప్రియాంకాగాంధీ పోటీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. మహారాష్ట్ర, ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను మంగళవారం ప్రకటించిన ఎన్నికల కమిషన్, వయనాడ్ లోక్‌సభ సీటుతో పాటు 47 అసెంబ్లీ స్థానాలకు నవంబరు 13న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఆ వెంటనే వయనాడ్ సీటుకు ప్రియాంక అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ ప్రకటన చేసింది. రాహుల్‌గాంధీ వయనాడ్(కేరళ) సీటును వదులుకొని రాయ్‌బరేలీ(యూపీ) లోక్‌సభ స్థానానికే ప్రాతినిధ్యం వహిస్తారని పార్టీ గతంలోనే తెలిపింది. కాగా, వయనాడ్‌లో గనక ఆమె గెలిస్తే.... ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు(సోనియా, రాహుల్, ప్రియాంక) మొట్టమొదటిసారిగా పార్లమెంటు సభ్యులుగా ఉంటారు.

# ఆ ఐదుగురు ఐఏఎస్‌లకు బిగ్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

స్థానికత ఉన్నప్పటికీ స్వాపింగ్ చేసుకునే అవకాశం గైడ్‌లైన్స్‌లో ఉందా?' అని క్యాట్ ప్రశ్నించింది. కాగా రాష్ట్ర పునర్విభజన సందర్భంగా జరిగిన కేటాయింపుల ప్రకారం ఆయా రాష్ట్రాలకు వెళ్లాలంటూ ఈ నెల 9న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కె.ఆమ్రపాలి, ఎ.వాణీప్రసాద్, డి.రొనాల్డ్‌రాస్, జి.సృజనలు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్)లో పిటిషన్ దాఖలు చేశారు.ఇదిలా ఉండగా ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రొనాల్డ్‌రాస్‌లు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏపీకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఏపీలో పనిచేస్తున్న సృజన తెలంగాణకు రావాల్సి ఉంది.






# అకారణంగా దాడి చేసిన వారిపై వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి

## తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షులు కుమ్ర జంగు పటేల్ డిమాండ్

**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** అదిలాబాద్ జిల్లా కేంద్రంలో స్థానిక ప్రెస్ క్లబ్లో.... కుమ్ర జంగు పటేల్ తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షులు మరియు కొలాం సేవ సంఘం ఆదిమ గిరిజన వ్యవస్థాపక అధ్యక్షులు కోడప సోనేరావు ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తేదీ 13 10 20 24 రోజున మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు రామాయి గ్రామంలో సైదుపూర్ నుండి రెండు వాహనాలు కిరాయి నిమిత్తం భీమ్సరి గ్రామానికి... వెళ్ళుచుండగా కొంతమంది రామాయి గ్రామానికి చెందిన దుండగులు నడిరోడ్డుపై గుంపులుగా కూర్చుని. మద్యం సేవిస్తున్నారు.. సైద్పూర్ గ్రామానికి చెందిన రెండు వాహనాల డ్రైవర్లు సైడ్ ఇవ్వమని హార్న్ కొడుతూ ఎంత బతిమిలాడినా సైడ్ ఇవ్వకుండా బండ్ల నడుపు డ్రైవర్లపై మరియు కొలాం ఆదివాసి గిరిజనులపై.. లంబాడి కులానికి చెందిన వారిపై నిర్దాక్షిణ్యంగా వారిని కొడుతూ వాహనాలను ధ్వంసం చేసి వారి బట్టలు విప్పి బెల్టులతో కొడ్తూ.. కులం పేరుతో దూషించడం జరిగిందని వారిపై రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వగా రూరల్ ఎస్సై నామ మాత్రంగా కేసు పెట్టి ఎలాంటి విచారణ లేకుండా చేతులు దులిపేసుకున్నాడని రాథోడ్ చరణ్ సింగ్, రాథోడ్ రాజు, రిమ్స్ లో చికిత్స పొందగా రాథోడ్ అంకుష్ రిమ్స్ లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని, ఆదివాసి గిరిజనులను లంబాడీ కులస్తులను అటకాయించి కులం పేరుతో దూషించి బట్టలు విప్పి కొట్టి వాహనాలను ధ్వంసం చేసి... గిరిజనులను శారీరకంగా మానసికంగా ఇబ్బందుల పాలు చేసిన రామాయి గ్రామానికి చెందిన జిట్టా ప్రభాకర్, జిట్టా రత్నాకర్, శామ్ భాయ్, అనిల్, ఈశ్వర్, జ్ఞానేశ్వర్, ఇస్తారి, దత్తు, మరియు వారితో పాటు 50 మంది పై .. హత్యాయత్నం ఆస్తి నష్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయకుండా కేసును నీరుగారుస్తున్న ఎస్సై పై చర్యలు తీసుకొని ఆదివాసి గిరిజనులను ఆదుకొని దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని లేనియెడల జిల్లా వ్యాప్తంగా దళిత గిరిజన సంఘాల ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గేడం రాము తుడుం దెబ్బ ఆదిలాబాద్ మండల ప్రధాన కార్యదర్శి, వెట్టి దేవదాస్ ప్రధాన పురోహిత్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి,, రాథోడ్ దేవదాస్ లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు, జాదవ్ రోహిదాస్ లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి,మెంతెం దత్తు బీసీ సంఘం డివిజన్ అధ్యక్షులు, కుంర రాజు కోలాం యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి , మోతే బారికరావు ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, నలగంటి మహేష్ మాదిగ జేఏసీ మండల అధ్యక్షులు, ఆత్రం అంబదాస్ పిసా మొబలైజర్, రాయచడం తారు విటిడిఏ చైర్మన్ సైదుపూర్, మడపాచి శ్యాంసుందర్ మాజీ సర్పంచ్ మేడిగూడ తది తరులు పాల్గొన్నారు.

# ఇచ్చోడ సంపూర్ణంగా బంద్



**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** మహమ్మద్ ప్రవక్త పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యతి నరసింహానంద ను శిక్షించాలని జాయింట్ ముస్లిం కమిటీ పిలుపుమేరకు మంగళవారం ఇచ్చోడ బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం నుండి దుకాణాలు బంద్ ఉండడంతో మార్కెట్ బోసిపోయింది. ఎలాంటి ఆవంచనియా సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బంధవస్తు నిర్వహించారు. అనంతరం జాయింట్ ముస్లిం కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. హిందూ ముస్లింలు అందరూ ఐక్యతగా ఉంటుంటే ఓర్వలేక కొన్ని దుష్టశక్తులు కావాలనే ఉద్దేశపూర్వకంగా దేశంలో అశాంతిని నేల కోల్పే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అలాంటి వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మహమ్మద్ ప్రవక్త పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యతి నరసింహానంద ను కఠినంగా శిక్షించాలన్నారు.



# గిరిజన రైతుల భూములు ఆక్రమించిన భూస్వామి పై క్రిమినల్ కేసులు పెట్టాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్

**శంకర్పల్లి అక్టోబర్ 15:(డైలీ రిపోర్ట్):** కొండకల్ తాండ గిరిజన రైతుల భూములను వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అమ్మిన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని అపర్ణ కన్స్ట్రక్షన్, కు అమ్మేసిన భూస్వామి విక్రమ్ రెడ్డి పై క్రిమినల్ కేసులు పెట్టాలని గిరిజన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేసి అనంతరం డిఆర్ఓ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కొనుగోలు చేసిన రైతుల భూములతో పాటు బిల్ దాఖలు మరియు సీలింగు అలాగే అసైన్డ్ భూములను చెరువులను ఆక్రమించి వందల కోట్లకు అమ్ముకొని భూస్వామి విక్రమ్ రెడ్డి తీవ్రంగా మోసం చేశాడని ఆయన విమర్శించారు.విక్రమ్ రెడ్డి ఆగడాలకు అడ్డే లేకుండా పోయిందని పోలీసులను అధికారులను అడ్డం పెట్టుకొని బౌన్సర్ ద్వారా బెదిరించి అక్రమ కేసులు బనాయించి గిరిజన రైతులను నానా తంటాలు పెడుతున్నారని గిరిజన రైతులు ఏడ్చిన అధికారులకు కనబడటం లేదని ఆయన మండిపడ్డారు. గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకు సిపిఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి భూములను వారికి ఇప్పించాలని అలాగే ప్రభుత్వ ఆసైన్డ్ సీలింగ్ భూములను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే రామస్వామి శంకర్పల్లి పార్టీ మండల కార్యదర్శి పి సుధీర్, నందిగామ కార్యదర్శి గడ్డం జంగయ్య రైతులు శంకర్ నాయక్, రవి నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్ శాఖలో త్వరలో కారుణ్య నియామకాలు

**ఏఈఈల శిక్షణ కార్యక్రమంలో మంత్రి సీతక్క**

హైదరాబాద్: కొత్తగా నియమితులైన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఏఈఈ) నాణ్యతపై రాజీలేకుండా, ప్రమాణాలు పాటిస్తూ శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు చేపట్టాలని మంత్రి సీతక్క సూచించారు. తమ శాఖ పరిధిలో త్వరలోనే 500కు పైగా కారుణ్య నియామకాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకా రం తెలిపారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1, 375 కోట్లతో రోడ్లు వేయబోతున్నామని, ఏఈఈల ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభం కావడం అదృష్టమని తెలిపారు. 'అభివృద్ధి పనుల్లో మీ మార్కును చూపాలి. నాణ్యత లేని పనులు చేస్తే సస్పెండ్ అవుతారు'అని హెచ్చరించారు. ఇటీవల నియామక పత్రాలు అందుకున్న ఏఈఈలకు మంగళవారం పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, అందరూ నిబద్ధతతో అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలన్నారు.

# సర్దార్ నగర్ వీధి లైట్స్ కోసం బీజేపీ నాయకులు మున్సిపల్ చైర్ పర్సన్ కువినతి పత్రం అందజేత

**తుక్కుగూడ ,15(డైలీ రిపోర్ట్) :** తుక్కుగుడ నుండి సర్దార్ నగర్ వరకు స్ట్రీట్ లైట్ల ఫిట్టింగ్ పూర్తి అయి దాదాపు ఒక సంవత్సరం అయినా ఈ రోజు వరకు స్ట్రీట్ లైట్లు ఆన్ చెయ్యలేదు. సర్దార్ నగర్ ప్రజల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని త్వరిత గతిన వీధి లైటింగ్ ఆన్ చేయాలని తుక్కు గుడ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో తుక్కుగూడ మున్సిపల్ చైర్ పర్సన్ బరిగల హేమలత రాజు గౌడ్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అధికారుల నిర్లక్ష్యం ఎవరికీ పట్టింపు లేక స్ట్రీట్ లైట్లు నిరూపయోగంగా పడి ఉన్నాయి అని బీజేపీ తుక్కుగూడ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్ట్రీట్ లైట్లు ప్రారంభించాలని తుక్కుగూడ మునిసిపల్ చైర్ పర్సన్ బరిగెల హేమలత రాజు గౌడ్ కి వినతి పత్రం సమర్పించిన బీజేపీ నాయకులు.వెంటనే అధికారులతో మాట్లాడి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటానని తుక్కుగూడ చైర్ పర్సన్ హేమలత గౌడ్ బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు ప్రజ సమస్యలు కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.



# అద్దెలు లేవు.. అన్నం కూడా లేదా?

**కాంగ్రెస్ పాలనలో పూర్తిగా భ్రష్టుపట్టిన విద్యారంగం**

**విద్యార్థులు, యాజమాన్యాలు ధర్నాలు చేసే దుస్థితి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్: రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని, విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆ శాఖలో నెలకొన్న సమస్యలు తెలుసుకునే ఓపిక లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గురుకుల పాఠశాలల భవనాల అద్దె చెల్లించలేని స్థితిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం..విద్యార్థులకు కనీసం అన్నం కూడా పెట్టలేని స్థితికి దిగజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేటీఆర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు నిరవధికంగా మూసివేశారన్నారు. దీంతో ఆ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. మూసీనది ప్రక్షాళనకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి గురుకుల విద్యా సంస్థల భవనాల అద్దె, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల డబ్బు ఇచ్చేందుకు చేతకావడం లేదని కేటీఆర్ మండిపడ్డారు.



# హద్దులు లేని ప్రేమను పంచావంటున్న మిల్కీబ్యూటీ తమన్నా..

2005లో 'చాంద్ సా రోషన్ చెహ్రా'తో తెరంగేట్రం చేసింది మిల్కీబ్యూటీ తమన్నా. అదే ఏడాది మనోజ్ 'శ్రీ' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టింది. మొత్తంగా 19ఏళ్ల కెరీర్‌ని పూర్తి చేసుకుంది తమన్నా. దాంతో తమన్నాపై అభిమానులు శుభాకాంక్షల వర్షం కురిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నటి కాజల్ కూడా మిల్కీబ్యూటీకి శుభాకాంక్షలు తెలుపుతూ అభిమానులు ఎడిట్‌చేసిన తమన్నా పోస్టర్‌ను తన వ్యక్తిగత సామాజిక మాధ్యమంలో షేర్ చేసింది. దానిపై తమన్నా స్పందించింది.'నా కెరీర్ ఇంత హాయిగా సాగుతోందంటే కారణం నీ స్నేహం. ఇన్నేళ్లు నాకెంతో మద్దతుగా నిలిచావు. హద్దులు లేని ప్రేమను పంచావు. థాంక్యూ కాజూ..' అంటూ రిప్లయ్ ఇచ్చింది తమన్నా. ఇంకా చెబుతూ 'ఇంతమంది అభిమానుల్ని సంపాదించుకోగలిగాను. వారి ఉత్సాహమే నాలో శక్తిని రెట్టింపు చేస్తున్నది. రానున్న కాలం ప్రేమతో నిండిన లెక్కలేనన్ని జ్ఞాపకాలకు వేదిక కానుంది. మీ అందరికీ నచ్చే సినిమాలే చేస్తానని హామీ ఇస్తున్నా' అంటూ అభిమానులను ఉద్దేశించి పోస్ట్ పెట్టింది తమన్నా.



# మీరొస్తే కథలు రాస్తాం.. సమంతకు త్రివిక్రమ్ ఆఫర్

అలియాభట్ ప్రధాన పాత్రలో నటించిన 'జిగ్రా' చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు త్రివిక్రమ్, రానా, సమంత అతిథులుగా పాల్గొన్నారు. ఈ వేడుకలో సమంతను ప్రశంసలతో ముంచెత్తారు త్రివిక్రమ్. దక్షిణాదిలో రజనీకాంత్ తర్వాత అంతటి ఫ్యాన్‌బేస్ సమంతకు మాత్రమే ఉందన్నారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్-సమంత మధ్య ఆసక్తికరమైన సంభాషణ చోటుచేసుకుంది. 'మీరు ముంబయికి మాత్రమే పరిమితం కాకుండా అప్పుడప్పుడు హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమాలకు కూడా రావాలి. ఇక్కడ సినిమాలు చేయండి. మీరు సినిమాలు చేయరేమో అనే భయంలో మేము రాయడం లేదు. మీరు నటిస్తానంటే మేం కథలు రాస్తాం. మీరు ఇక్కడకు రావాలంటే మేమంతా కలిసి 'అత్తారింటికి దారేది' తరహాలో 'సమంత హైదరాబాద్ రావడానికి దారేది' అంటూ హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ చేయాలేమో' అని త్రివిక్రమ్ సరదాగా మాట్లాడారు.



# సినిమా ప్రయాణం అంతా ఓ సాహస యాత్రలా అనిపించింది: చాందిని చౌదరి

'కొన్ని కథలు విన్నప్పుడు నన్ను నేను నియంత్రించుకోలేను. 'గామి' కథ విన్నప్పుడు తప్పకుండా అందులో భాగం కావాలనిపించింది' అని చెప్పింది చాందిని చౌదరి. ఆమె కథానాయికగా విశ్వక్‌సేన్‌తో కలిసి నటించిన చిత్రం 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకుడు. ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చాందిని చౌదరి మాట్లాడుతూ "గామి' అంటే గమ్యాన్ని గమించేవాడు అని అర్థం. సినిమాను వారణాసి, కుంభమేళ, కశ్మీర్, హిమాలయాల్లోని రియల్ లోకేషన్స్‌లో షూట్ చేశారు. సినిమా ప్రయాణం అంతా ఓ సాహస యాత్రలా సాగింది. టీం అంతా ఐదేళ్ల పాటు సినిమా కోసం శ్రమించాం. ఐమాక్స్ స్క్రీన్‌లో ట్రైలర్ చూసినప్పుడు మేం పడిన కష్టానికి ప్రతిఫలం లభించిందనే భావన కలిగింది' అని చెప్పింది. నటిగా పదేళ్ల సినీ ప్రయాణంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, జయాపజయాలతో సంబంధం లేకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పనిలో సాగిపోవాలనే సత్యాన్ని తెలుసుకున్నానని ఆమె తెలిపింది. అన్ని జోనర్స్ సినిమాలు చేయాలన్నదే తన లక్ష్యమని, ఈ ఏడాది తాను నటించిన నాలుగు సినిమాలు రాబోతున్నాయని చాందిని చౌదరి పేర్కొంది.

# స్పీడందుకున్న గేమ్‌చేంజర్

మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'గేమ్‌చేంజర్'. దాదాపు రెండున్నరేళ్లుగా ఈ సినిమా షూటింగ్ జరుగుతూనేవుంది. శంకర్ 'భారతీయుడు' ఫ్రాంచైజీతో బిజీ కావడమే ఈ జాప్యానికి కారణం. అయితే, ఎట్టకేలకు ఈ సినిమా నిర్మాణంలో వేగం పెంచారు దర్శకుడు శంకర్. సునీల్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆయన నేపథ్యంలోసాగే సన్నివేశాలను చిత్రీకరించారు.తదుపరి షెడ్యూల్ ఈ నెలాఖరు నుంచి షురూ చేశారు. రామ్‌చరణ్ లేని సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో పూర్తి చేస్తారని సమాచారం. దీనికోసం సెకండ్ యూనిట్‌ను నియమించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వానీ, అంజలి కథానాయికలు. శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, నరేశ్, సముద్రఖని, నాజర్, ప్రియదర్శి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాత: దిల్‌రాజు.



# పరశురామ క్షేత్రం నేపథ్యంలో జరిగే కథ

'గోపీచంద్ గతంలో కొన్ని పోలీస్ పాత్రలు చేశారు. కానీ ఇలాంటి పోలీస్‌గా చేయడం మాత్రం ఇదే ప్రథమం. ప్రస్తుతం ప్రేక్షకులు ఇలాంటి కథలను బాగా ఆదరిస్తున్నారు. తప్పకుండా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచే సినిమా అవుతుంది' అన్నారు నిర్మాత కె.కె.రాధామోహన్. గోపీచంద్ హీరోగా ఆయన నిర్మించిన చిత్రం 'భీమా'. ఏ.హర్ష దర్శకుడు ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత మాట్లాడారు. 'ఇటీవల విడుదలైన గోపీచంద్ సెకండ్ లుక్, ట్రైలర్‌లోని కొన్ని సన్నివేశాలను చూసి చాలామంది ఈ సినిమాను 'అఖండ'తో పోలుస్తున్నారు. నిజానికి ఈ సినిమాతో 'అఖండ'కు ఏమాత్రం సంబంధంలేదు. ట్రైలర్‌లో చూపించిన పరశురామక్షేత్రం బెంగళూరు, బాదామీ పరిసరాల్లో ఉంటుంది.ఆ క్షేత్రం నేపథ్యంలో జరిగే కథ ఇది. ట్రైలర్‌లో కనిపిస్తున్న అఘోరాలు, శివాలయం ఇవన్నీ కేవలం యాంబియన్స్ కోసమే. అంతే తప్ప అఘోరాలకూ ఈ కథకూ ఎలాంటి సంబంధం లేదు' అని తెలిపారు రాధామోహన్.

# టాలీవుడ్‌లో మరో మల్టీస్టారర్ షురూ.. అడివి శేషుతో జట్టుకట్టిన దుల్కర్ సల్మాన్

తెలుగులో అప్పుడప్పుడు మల్టీస్టారర్ సినిమాలు పలకరించడం కామనే. సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు, గోపాల గోపాల, ఆర్‌ఆర్‌ఆర్, ఎఫ్2, వెంకీమామ.. ఇలా మల్టీస్టారర్స్ వస్తూనేవున్నాయి. రానున్న భారీ మల్టీస్టారర్ అంటే అందరికీ గుర్తొచ్చే సినిమా 'కల్కి 2898 ఏడీ'. ఇందులో ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్, దుల్కర్ ఇలా చాలామంది స్టార్లు నటిస్తున్నారు.రాబోతున్న 'ఎన్‌బీకే 109' కూడా ఓ విధంగా మల్టీస్టారరే అనాలి. ఎందుకంటే అందులో బాలకృష్ణతో పాటు దుల్కర్‌సల్మాన్ కూడా నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే టాలీవుడ్‌లో మల్టీస్టారర్‌కి తెరలేవనుంది. దుల్కర్ సల్మాన్, అడివి శేషు ఇందులో నటించే స్టార్లు. దర్శకుడు పరశురామ్ దగ్గర పనిచేసిన ఓ యువ దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనేది లేటెస్ట్ న్యూస్. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.





Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707